# సంపాదకీయము

వర్షాకాలము యతులకు, యోగులకు ముఖ్యము. సర్వదా పరమాత్మను స్మరించుటకు ఈ కాలము బహు యుక్తమని, యీ కాలమందే చాతుర్మాస్యము చేయుట మనకనాదిగా వస్తున్న అచారము. ఒక బిడాలముగూడ ఈ వ్రతముపేరు చెప్పి తన పబ్బం గడుపుకొన ప్రయత్నించడము పంచతంత్ర కథాసంపుటిద్వారా మనకు విదితమే. కిరీటిగూడ ఈ కాలమునే యెంచుకొని సుభద్రా పాణిగ్రహణమొనరించాడనేది మనకు తెలుసు. యోగులెవ్వరో, కుయోగులెవ్వరో వివక్షతచూపక తన విధ్యుక్త ధర్మము నెరవేర్చుటే ప్రకృతి ధర్మము. బాహ్యమయిన వర్షము పంటలకు అత్యవసరము. భగవదనుగ్రహమనే వర్షము ఆధ్యాత్మిక పురోగతికి చాలా ముఖ్యము. ఆ వర్షము చిరుచినుకులు కావచ్చు లేక ఘనమేఘవర్షమూ కావచ్చు. అది గురుకృప.

సదాశివుడు ధ్యానము చేస్తుంటాడు. అలాగే మహా విష్ణువు యోగనిద్రలో యుంటాడు. యోగము మనకు భగవంతునికీ కూడ రక్షణోపాయము. తనను విడిచియుండలేని సాధకులు తనను చేరుకొనుటకు చేయు ధ్యానము పరమాత్మునికి గల గుణవైభవము. అట్టి గుణవైభవమును ఇచ్ఛాశక్తితో మనఎడల ప్రసరింపచేయు ప్రక్రియే ప్రాణాహుతి యని మనమెరుగుదుము. ఇది మన హృదయములో వర్షిస్తుంది. మనకు శాంతిని ప్రసాదిస్తుంది. తను లేక మనలేని శరణాగతులు తనను చేరడానికి చేయు ప్రయత్నములను గని వీరినింత కష్ఠములకు లోనుగాంచితినేయని కలతచెంది, తనలో ఈ గుణమును భక్తులకు విశేషముగా అనుభవింప చేసినది శ్రీ కృష్ణ పరమాత్మయే యనునది మనమెరుంగుదుము. ఇది భగవంతుని నిర్హేతుక ప్రేమకు తార్కాణము.

మనలో ఆధ్యాత్మికతకు కేంద్రము హృదయము. మన ఆధ్యాత్మిక పురోగమనానికిగాని, పతనానికిగాని కారణము మన భావనలే. పరిశుద్ధమయిన మనస్సులో తప్ప పరమాత్మను దర్శించుకోలేము. సదా మనలోనేయున్న పరమాత్మయొక్క కృపావిశేషము మనలను నిరంతరము పునీతులుగా మార్చయత్నిస్తూనే యుంటుంది. అయినా చంచలమైన బుద్ధి నిమ్నోన్నత భావాల నడుమ ఊగిసలాడుతూ స్థిరచిత్తమలవడ వీలుగాకుండ అడ్డుపడుతూనేయుంటుంది. భూమిని సాగుకనుకూలంగా తయారు చేయడంలోనే రైతు కృషి కనబడుతుంది. ఇది కానిదే ఎంత వర్షమయిన అంత ఉపయోగపడదు. అట్లే సాధకుడు తన మనస్సును అభ్యాస, వైరాగ్యములతో వ్యవసాయపరచుకొన్నప్పుడు భగవత్ప్రేమ సఫలీకృతమవుతుంది. శ్రీ కృష్ణుని గీతా ప్రబోధము మానవాళికి సర్వదా ఆదరనీయము.

ప్రేమ ఫలించాలంటే స్వార్థం నశించాలి. ఏకత్వం కావాలంటే బహుత్వం పోవాలి. భగవత్కృపలేనిదే ఇది సాధ్యంకాదు. ఆ భగవత్కృపారస పానమే మనమనుదినము అనుభవించు ప్రాణాహుతి. ఈ భాగ్యమందరికి కలుగాలనే ప్రార్థన మనందరి కర్తవ్యము.

(జన్మాష్టమి సంచిక :2005: 12-3)